రోజూ అమావాస్యే!

ఎల్‌ఈడీ లైట్లు వెలగవు.. కొత్తవి ఏర్పాటు చేయరు.. ఉన్న వాటికి మరమ్మతులు చేయరు.. ఇలా వీధి దీపాల్లోనూ రాజకీయం చూపిన కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ బల్బుల నిర్వహణను గాలికి వదిలేసింది. దీంతో నేతాజీ వంతెన కూడలి రహదారిలో విద్యుత్ స్తంభాలకు ఎల్‌ఈడీ లైట్లు వెలగక అంధకారం రాజ్యమేలుతోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వంతెనపై ఉన్న విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. వాటిని తొలగించకుండా పాదచారులు నడిచే ఫుట్‌పాత్‌లపై అడ్డంగా వేసి వదిలేశారు. దీంతో రాత్రి వేళల్లో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలూ చోటు చేసుకుంటున్నాయి. అలాగే వివిధ ప్రాంతాల్లో కూడా వీధి దీపాలు వెలగడం లేదు. -కంచరపాలెం


దయానందనగర్‌లో వెలగని విద్యుత్ లైట్లు


కొండవాలు ప్రాంతాల్లో నిత్యం ఇదే పరిస్థితి


ఊర్వశికూడలి గౌరీనగర్‌లో విద్యుత్ స్తంభానికి లైట్లు లేని దృశ్యం

- అంధకారంలో వీధులు
- విద్యుత్ దీపాల నిర్వహణ అస్తవ్యస్తం
- పట్టించుకోని నాయకులు, అధికారులు

40వ వార్డు నుంచి 63వ వార్డులకు సంబంధించిన విద్యుత్ దీపాల వివరాలు

హైమాస్ట్ లైట్లు	92
రింగులైట్లు (120 వాట్స్)	132
ప్రధాన జంక్షన్‌ల్లో భారీ స్తంభాల లైట్లు	18
ఎల్‌ఈడీ వీధి లైట్లు (20వాట్స్)	3800
ఎల్‌ఈడీ వీధి లైట్లు (40వాట్స్)	4200
ఎల్‌ఈడీ వీధి లైట్లు (60వాట్స్)	2950
ఇతరత్ర లైట్లు	1820

కంచరపాలెం కూడలి నుంచి ఊర్వశి కూడలి మీదుగా ఐటీఐ జంక్షన్ వరకు వీధుల్లో తరచూ దీపాలు వెలగడంలేదు. దీంతో అ ప్రాంతమంతా అంధకారం అలముకుంటుంది. అసలే ఇరుకు సందుల్లో ద్విచక్ర వాహనాలు రాకపోకల వేగానికి అడ్డూ అదుపు ఉండడంలేదు. చీకట్లో రాత్రి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జీవీఎంసీ 47,48, వార్డుల కొండవాలు ప్రాంతాలు రాంజీ ఎస్టేట్, కప్పరాడ, ఇందిరానగర్, పెదకొత్తూరు. శ్రీనివాస్‌నగర్, బాపూజీనగర్, సంజీవయ్యకాలనీ, అరుంధతి నగర్, జైభారత్‌నగర్, శివలింగపురం, జీవీఎంసీ 56, 57వ వార్డుల మురికివాడల ముత్యమాంబకాలనీ, పైడిమాంబకాలనీ, రాజీవ్‌నగర్, దయానంద నగర్, చాకలిగెడ్డ గొల్లకంచరపాలెం, గవరకంచరపాలెం, రామ్మూర్తిపంతులుపేట, దుర్గానగర్, గౌరీనగర్, ప్రాంతాలల్లో రాత్రిపూట కొన్ని దీపాలు వెలగడం లేదు. వీధి దీపాల నిర్వహణ అధ్వానంగా మారింది. తరచూ ఇదే పరిస్థితి నెలకొంటుందని, సమస్యపై ఫిర్యాదులు చేసినా జీవీఎంసీ విద్యుత్ శాఖ అధికారులు స్పందించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

చీకట్లో రాకపోకలు సాగిస్తున్నాం



రాత్రి సమయంలో మా వీధుల్లో విద్యుత్ దీపాలు సక్రమంగా వెలగడం లేదు. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలకు దీపాలే లేవు. అటుగా రాకపోకలు సాగించాలంటేనే భయాందోళనగా ఉంది. ఆకతాయిల ఆగడాలు శృతిమించిపోతున్నాయి. పిల్లలను బయటకు పంపాలంటే ఇబ్బందిగా మారుతోంది. విద్యుత్ దీపాల నిర్వహణ అధ్వానంగా ఉంది. జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు.
-సీహెచ్ ఈశ్వరమ్మ, రాంజీ ఎస్టేట్, కంచరపాలెం.

అధికారులు స్పందించాలి



జోన్-5 పరిధిలో విద్యుత్ దీపాల నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంది. ప్రధాన రహదారులు, వంతెన రహదారి, పలు వీధుల్లో విద్యుత్ దీపాలు సక్రమంగా పనిచేయడంలేదు. ఫిర్యాదు చేస్తే సిబ్బంది తూతూ మంత్రంగా మరమ్మతులు చేస్తున్నారు. కాలం చెల్లిన విద్యుత్ దీపాలు వేసి చేతులు దులుపుకుంటున్నారు. సంబంధిత అధికారులు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.
-ఆర్ రాము, బర్మాక్యాంప్, ఊర్వశికూడలి,

క్లుప్తంగా

మైనర్లు వాహనాలు నడపకూడదు


మాట్లాడుతున్న సీఐ విజయకుమార్

సీతమ్మధార: మైనర్లు వాహనాలను నడకూడదని ఫోర్తుటౌన్ సీఐ ఎస్.విజయకుమార్ తెలిపారు. మంగళవారం అక్కయ్యపాలెంలో నారాయణ టెక్నో స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన 18 ఏళ్లు దాటిన తరువాత లైసెన్స్ తీసుకున్న తరువాత వాహనాలు నడపాలని సూచించారు. అలాగే మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, చదువే లక్ష్యం కావాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ, కె.వెంకటరావు, స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసుల స్పెషల్ డ్రైవ్

సీతమ్మధార: సీతమ్మధారలోని బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని ట్రాఫిక్ సమస్య ఉన్న ప్రాంతాల్లో ద్వారకా ట్రాఫిక్ పోలీసులు డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ ఎస్ఐ భాస్కరరావు ఆధ్వర్యంలో సిబ్బంది రోడ్డుపై అడ్డదిడ్డంగా పార్క్ చేసిన వాహనదారులకు అవగాహన కల్పించారు. సీతమ్మధార, బాలయ్యశాస్త్రిలేఅవుట్, ఈస్టు గేటు, ఎస్ఎఫ్ఎస్ స్కూల్ ప్రాంతాలలో డ్రైవ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాలు నిలపాలని, అడ్డదిడ్డంగా వాహనాలు నిలిపితే జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతమ్మధార : ఆశీలమెట్ట సెక్షన్ కార్యాలయం పరిధిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని జోన్-1 ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. సబ్బం హరి ఇంటి దగ్గర ఉన్న ప్రాంతంలో ఎస్.ఎస్.236 ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించి మరమ్మతులు చేయనున్న నేపథ్యంలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఎమ్మెల్యేకు అభినందనలు


ఎమ్మెల్యేకు అభినందనలు తెలుపుతున్న పసుపులేటి ఉషాకిరణ్

సీతమ్మధార : ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజును శాసనసభపక్ష నేతగా ఎన్నికైన నేపథ్యంలో జనసేన నాయకులు మంగళవారం ఆయనను అభినందించారు. బాలయ్యశాస్త్రిలే అవుట్‌లోని బీజేపీ కార్యాలయంలో జనసేన నార్త్ ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
S.O.P. No.24/2023

Between:
Gujju Appala Reddy & 2 others .....Petitioner
And:
The Hyderabad Agricultural Co-operative Association Ltd., Hyd, Rep. by its Joint Registrar/Managing Director ...Respondent

GENERAL NOTICE

The public in general are hereby informed that the in the year 1983 deceased Gujji Laxmi had got with married with Mr. G.Rambabu, out of there wedlock no children were born and also G.Rambabu does not have their own blood relations and he died in the year 1985 and her wife i.e. Gujji Lakshmi also died on 25-05-2022, as such the petitioners filed the above petition to issue Succession Certificate in their favour enabling them to transfer the schedule property mentioned in above case, which stands in the name of the deceased Gujji Laxmi. The above matter stands posted to **07-08-2024**. Therefore, the public in general are hereby informed that anyone having any claim, right, title or interest over the schedule property or any objection may lodge their claim in writing with supporting proofs to the undersigned within **7 days** from the date of publication of this notice, failing which it shall be deemed that there are no valid claims/tenable objections whatsoever and our clients shall go ahead with the aforesaid transaction.

B. SREEBALA & P.D.V. JEDIDIAH
Advocates, Visakhapatnam
Cell: 99598 69892, 89788 14244

కేవీ-1 విద్యార్థులకు వైద్యపరీక్షలు

కంచరపాలెం: స్థానిక 104 ఏరియా కేంద్రీయ విద్యాలయం-1లో విద్యార్థులకు రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో ఆధ్వర్యంలో మంగళవారం ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా 3020 అసిస్టెంట్ గవర్నర్ కె.సునీత లావణ్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. నిర్వాహకులు మాట్లాడుతూ విద్యార్థులకు ఏటా వైద్య పరీక్షలు చేయిస్తున్నట్లు తెలిపారు. సుమారు 1245 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైజాగ్ మెట్రో అధ్యక్షుడు డాక్టర్ గంగాధర్, కార్యదర్శి రొటేరియన్ రాజేష్, క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మొదిలి మహేష్, పూర్వ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ జి.కిషోర్, ప్రాజెక్ట్ డైరెక్టర్ ఒమ్మి కిరణ్, నాగిరెడ్డి హరిత, రాజు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో రోటరీ క్లబ్ సభ్యులు

2న మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో క్లరికల్, టెక్నికల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆగస్టు రెండో తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారులు సీహెచ్ సుబ్బిరెడ్డి (క్లరికల్) తెలిపారు.
అమర్ రాజా గ్రూప్, సెనర్జీస్ కాస్టింగ్, ముత్తూట్ గ్రూప్, అపోలో ఫార్మసిస్, హెల్త్‌కేర్, శ్రీరామ్ చిట్స్ ఇండియా, డబ్ల్యూఎస్ఎస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలలో 1090 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. అసోసియేట్స్, మిషన్ ఆపరేటర్, ట్రైనీ ఆపరేటర్, జూనియర్ రిసెప్షనిస్ట్, ఆఫీసర్ ప్రోబిషనరీ ఆఫీసర్, ఆర్‌టీఏ, ఫార్మసిస్ట్, బెడ్ సైడ్ కేర్ గివర్ (బీసీజీ), మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్స్, రికవరీ ఎగ్జిక్యూటీవ్స్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, ఎంబీఏ, డిప్లమో, ఫార్మసీ ఏదైనా డిగ్రీ, ఆయా ఉద్యోగాలకు బట్టీ ఉత్తీర్ణత సాధించిన 18-35 సంవత్సరాల వయసు కల్గిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఆయా ఉద్యోగాల బట్టి జీతం నెలకు రూ13,000 నుంచి రూ. 20 వేలు వరకు ఉంటుందన్నారు. కంచరపాలెం జిల్లా ఉపాధి కార్యాలయంలో ఆరోజు 10గంటలకు జాబ్‌మేళాకు హాజరుకావాలని కోరారు.

తిరుపతిలో వెలమలకు ఓ కాటేజీ

దాబాగార్డెన్స్: వేంకటేశ్వర స్వామి దర్శనం కోసం వెళ్లే తిరుమల వెళ్లే వెలమ కుల భక్తుల సౌకర్యార్థం వెలమ సంఘ నేతలు తిరుపతిలో వసతి నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు. ఇప్పటికే నిర్మించిన శ్రీశైలం, కాశీ పుణ్యక్షేత్రాల్లోని కాటేజీల తరహాలో తిరుపతిలో కూడా భవనాలు నిర్మించాలని ఆల్ వెలమ సంక్షేమ సంఘం ప్రతిపాదించింది. రాష్ట్రం నలుమూలల నుంచి పలువురు సంఘ ప్రతినిధులు విశాఖ కేంద్ర సంఘం కార్యాలయంలో సమావేశమై ఈ మేరకు తీర్మానించారు. తిరుపతి నుంచి వచ్చిన కర్రి సతీష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ వసతి భవనాల నిర్మాణానికి అవసరమైన స్థల, నిధుల సేకరణకు రాష్ట్రంలోని వెలమ జాతీయులందర్నీ కలిసి సలహాలు, సూచనలు సేకరిస్తామన్నారు. వెలమ సెంట్రల్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు చుక్క చినబాబు మాట్లాడుతూ సామాజికంగా, రాజకీయంగా వెలమలంతా ఐకమత్యంతో ఒక్కటై పయణించాలని పిలుపునిచ్చారు. ఆర్గనైజేషన్ ప్రధాన కార్యదర్శి బండారు రామకృష్ణ, ఆల్ వెలమ సమన్వయకర్త అల్లు శంకరరావు, గూనూరు వెంకట రమేష్, సిరికి పోతురాజు, సింగంపల్లి రామారావు, కింజరాపు సూర్యనారాయణ, మరడాన శేషగిరిరావు, రంభ బుజ్జి, జి.లక్ష్మణ, సింహాచలం పాల్గొన్నారు.


సమావేశమైన వెలమ సంఘం ప్రతినిధులు

ఉచిత ఇసుక పంపిణీ విధానం పక్కాగా అమలు కావాలి

మహారాణిపేట: జిల్లాలో అమలవుతున్న నూతన ఉచిత ఇసుక పంపిణీ విధానం పక్కాగా అమలు కావాలని జేసీ కె.మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాలో పలువురు అధికారులతో కలిసి ఆయన ఇసుక డిపోలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నూతన ఉచిత ఇసుక సరఫరా విధానాన్ని అమలు చేస్తోందన్నారు. జిల్లాలో సజావుగా, సులభతరంగా ఇసుక పంపిణీ విధానం అమలుకావాలని దిశా నిర్దేశం చేశారు.

దేవమాత ఉత్సవాలకు ఏర్పాట్లు

కంచరపాలెం : జ్ఞానాపురంలోని కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కోడిగుడ్ల పూర్ణిమ మంగళవారం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పర్యటించారు. ఆగస్టు 1 నుంచి జరగనున్న దేవమాత తేరు ఉత్సవాలకు గోతులు, రహదారులు పూడ్చాలని, వీధిలైట్లు సక్రమంగా వెలిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ముందుగా బాబుకాలనీ, సెబాస్టియన్ కాలనీ, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు పలు సమస్యలపై కార్పొరేటర్ పూర్ణిమకు వినతిపత్రాలు అందజేశారు. జీవీఎంసీ కమిషనర్ దృష్టికి వాటిని తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్, వేశం గిణిరావు, సచివాలయ సిబ్బంది సతీష్, ప్రభు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో ప్రతిభ


యోగాసనాల్లో ప్రతిభ చాటిన హరగోపాల్ స్కూల్ విద్యార్థులు

తాటిచెట్లపాలెం: యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇటీవల విశాఖలో జరిగిన జిల్లా స్థాయి యోగాసన పోటీల్లో రైల్వేన్యూకాలనీలోని హరగోపాల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. డి.దీపక్ రెడ్డి, పి.నగేష్ జిల్లా స్థాయి పోటీల్లో మూడు, నాలుగు స్థానాలలో నిలిచారు. వీరిద్దరూ 9వ తరగతి చదువుతున్నారు. త్వరలో రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొనున్నారు. ఈ సందర్భంగా వీరిని స్కూల్ ప్రిన్సిపాల్ టి.శంకరనారాయణ, సిబ్బంది అభినందించారు.

పచ్చని చెట్లు తొలగింపు


ఫోర్తుటౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు తొలిగింపు

సీతమ్మధార : సీతమ్మధారలోని పలు చోట్ల నీడ నిచ్చే చెట్లు తొలగించడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫోర్తుటౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న చెట్లు నరికివేయడంతో స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు నీడలేక పోవడంతో ఎండలో కూర్చునే పరిస్థితి నెలకొంది. స్టేషన్ ప్రాంతంలో పలు చోట్ల చెట్లు నరికి వేయడంతో నీడ లేక అవస్థలు పడుతున్నారు.

కొండవాలు సమస్యలు పరిష్కరించండి

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం కొండవాలు ప్రాంతాల్లో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం వార్డు కార్పొరేటర్ గంకల కవిత నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు వినతి పత్రం అందించారు. వార్డులో పర్యటించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు గంకల అప్పారావు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం


ఎస్.గాంధీ (ఫైల్)

సీతమ్మధార : వైద్యం నిమిత్తం విశాఖకు తీసుకొచ్చిన మతిస్థిమితం లేని ఓ వృద్ధుడు అదృశ్యం కావడంతో బంధువులు ఫోర్తుటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏలూరు జిల్లా జంగారెడ్డి గూడెం ప్రాంతానికి చెందిన ఎస్.గాంధీ (60) వ్యవసాయ పనులు చేస్తుండేవాడు. కొంతకాలంగా మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో కుటుంబ సభ్యులు సోమవారం వాల్తేరులోని మెంటల్ ఆస్పత్రికి తీసుకువచ్చి చూపించారు. అనంతరం తిరుగు ప్రయాణం కోసం రైల్వేస్టేషన్‌కు వచ్చారు. రాత్రి పదిగంటల సమయంలో కుటుంబ సభ్యులంతా టిఫిన్ చేస్తుండగా గాంధీ కనిపించలేదు. రైల్వే స్టేషన్ పరిసరాలు వెతికినా జాడ కనిపించలేదు. దీంతో గాంధీ కుమారుడు నాగేంద్ర ఫోర్తుటౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. హెచ్‌సీ బంధం వరలక్ష్మి, పోలీసు సిబ్బంది రైల్వే స్టేషన్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో వెతికారు. కనిపించక పోవడంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఫొటోలో ఉన్న వ్యక్తి ఆచూకీ తెలిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని సీఐ ఎస్.విజయకుమార్ కోరారు. సెల్ . 94407 96012, స్టేషన్ నంబర్ 08912-710695కు సమాచారం ఇవ్వాలని కోరారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ వితరణ


స్టడీమెటీరియల్ అందుకున్న విద్యార్థులు

మురళీనగర్: మాధవదార జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ స్టడీ మెటీరియల్‌ను మంగళవారం పంపిణీ చేసింది. క్లబ్ అధ్యక్షురాలు పొందూరు ప్రభావతి అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ పాఠశాలలో చదువుతున్న 53మంది విద్యార్థులకు పదోతరగతి తెలుగు పాఠ్యాంశాలకు సంబంధించిన అధ్యయన మెటీరియల్‌ను అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు బి.హేమలత, తెలుగు ఉపాధ్యాయురాలు హైమావతి, వాకర్స్ డిస్ట్రిక్ట్-101 పూర్వ గవర్నర్ యు.సుభ, వనితా వాకర్స్ క్లబ్ కార్యదర్శి ఎం.జయ, పి.మహాలక్ష్మి, జి. షీలారాణి, జి.శిరీష, కె.భానుమతి, ఆర్.స్నేహలత, ఎ.లీలావతి, పి.సుభద్ర, వి.పద్మజారెడ్డి, సరోజ, లలిత, పద్మ పాల్గొన్నారు.

బృందావన్ పార్కు అభివృద్ధికి వినతి


ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు వినతి పత్రం అందిస్తున్న బృందావన్ పార్కు ప్రతినిధులు

మురళీనగర్: మురళీనగర్ సెక్టార్-11లోని బృందావన్ పార్కు అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజును పార్కు ప్రతినిధులు కోరారు. ఈ మేరకు వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ ఆధ్వర్యంలో బృందావన్ పార్కు సభ్యులు ఎమ్మెల్యేను మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందించారు. ప్రస్తుతం పార్కులో మట్టి వాకింగ్ ట్రాకు, ఓపెన్ ఆడిటోరియం అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ప్రస్తుతం ఉన్న చిన్నారుల ఆటమైదానంలో పిల్లల ఆటపరికరాలు, బెంచీలు ఏర్పాటు, సీసీటీవీల ఏర్పాటు, ప్రహరీకి పెయింటింగ్ పనులు, వాచ్‌మన్ గదికి మరమ్మతులు, పార్కు గేటు, విద్యుత్ లైట్లు ఏర్పాటు, పచ్చదనం పెంపునకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్కు కార్యదర్శి జి.మురళీ పాల్గొన్నారు.

రోడ్డుపై నిర్మాణ సామగ్రి డంపింగ్


ఫోర్తుటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని సర్వీస్ రోడ్డులో నిర్మాణ సామాగ్రి డంప్ చేయడంతో నిలిచిపోయిన వాహనాలు

సీతమ్మధార: జీవీఎంసీ పరిధి14 వార్డులోని ఫోర్తు టౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని సర్వీస్ రోడ్డులో భవన నిర్మాణ సామగ్రి డంప్ చేయడంతో మంగళవారం ట్రాఫిక్ సమస్య నెలకుంది. వాహనాలు భారీగా నిలిచిపోవడంతో పలువురు ఇబ్బంది పడ్డారు. సర్వీసు రహదారిలో భారీ వాహనాలు నిషేధం ఉన్నప్పటికీ యథావిధిగా రాకపోకలు సాగిస్తూ ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగజేస్తున్నాయి. భవన నిర్మాణ యజమానులు ఇష్టారాజ్యంగా సామగ్రి రోడ్డుపై డంప్ చేయడంతో పాదచారులకు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పోర్టు ఆస్పత్రి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆందోళన


పోర్టు హాస్పటల్ ఆందోళన చేస్తున్న కార్మిక సంఘం నేతలు

తాటిచెట్లపాలెం: పోర్టు హాస్పటల్‌ను ప్రైవేటీకరించాలని కేంద్ర మంత్రి నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పోర్టు కార్మిక సంఘాలు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ పీపీపీ పద్ధతిలో పోర్టు హాస్పటల్‌ను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణవలన పోర్టు కార్మికులు, రిటైర్డ్ ఉద్యోగేలు, వారి కుటుంబ సభ్యులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. పోర్టు ఆస్పత్రి ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి మసేన్, సీఎఫ్‌టీయూ ప్రధాన కార్యదర్శి కనకారావు, ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి గొర్లె చందు, సీఐటీయూసీ ప్రధాన కార్యదర్శి పద్మనాభరాజు, హెచ్ఎంఎస్ కోశాధికారి మంగయ్యానాయుడు, ట్రస్ బోర్డు మెంబర్ పోతన్న, వీరాంజనేయరావు, తదితరులు పాల్గొన్నారు.

పార్కు నిర్వహణకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

సీతంపేట: జీవీఎంసీ 26వవార్డు శంకువానిపాలెం చాకలిపేటలో ఇటీవల కొత్తగా నిర్మించిన పార్కు, వాకింగ్ ట్రాక్ నిర్వహణ గాలికి వదిలేయడంతో మందుబాబులకు అడ్డాగా మారింది. దీంతో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన పార్కు నిరుపయోగంగా మారింది. పార్కు దుస్థితిపై 'అభివృద్ధి చేశారు..నిర్వహణ మరిచారు' శీర్షికన మంగళవారం 'సాక్షి' పత్రికలో ప్రచురితమైన వార్తకు జీవీఎంసీ జోన్3 ఇంజనీరింగ్ (పబ్లిక్ వర్క్స్) కార్యనిర్వాహక ఇంజనీర్ స్పందించారు. రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ లేనందున పార్కు నిర్వహణ లోపించిందని తెలిపారు. వార్డు కార్పొరేటర్ సహాయంతో రెసిడెంట్ వెల్ఫేర్ అసోషియేషన్ ఏర్పాటు చేసి నిర్వహణ వారికి అప్పగిస్తామని వివరణ ఇచ్చారు. అలాగే పార్కులో మొక్కలు నాటేందుకు హార్టీకల్చర్ విభాగాన్నికోరామన్నారు. పిల్లల ఆట పరికరాలు అమర్చేందుకు అంచనాలు తయారు చేసి పరిపాలనా పరమైన ఆమోదం పొందిన తర్వాత ఏర్పాటుచేస్తామన్నారు.

తనికెళ్ల భరణికి 'రంగసాయి జీవన సాఫల్య పురస్కారం'


కార్యక్రమ వివరాలు వెల్లడిస్తున్న బాదంగీర్ సాయి

దాబాగార్డెన్స్: నాటకరంగ ప్రోత్సాహమే లక్ష్యంగా 2010 ఆగస్టు 1న ప్రారంభమైన రంగసాయి నాటక సంఘం 14 ఏళ్ల ప్రయాణంలో నాటక రంగానికి ఎనలేని సేవలందించిందని, ఎన్నో ప్రయోగాత్మక నాటకాలు, నాటికలు, నటశిక్షణ శిబిరాలు, పుస్తకావిష్కరణలు, సురభి పౌరాణిక పద్య నాటకాల ప్రదర్శన ఇలా ఎన్నో విశాఖ వాసుల ముందుంచిందని నిర్వాహకుడు బాదంగీర్ సాయి తెలిపారు. ఈ మేరకు మంగళవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో వార్షికోత్సవ కార్యక్రమ వివరాలు వెల్లడించారు. ఆగస్టు ఒకటిన కళాభారతి ఆడిటోరియం వేదికగా సాయంత్రం 6 గంటల నుంచి వార్షికోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు చెప్పారు. రంగస్థల నటుడు, రచయిత, దర్శకుడు తనికెళ్ల భరణికి 'రంగసాయి జీవన సాఫల్య పురస్కారం'అందజేయనున్నట్లు చెప్పారు. అలాగే ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉన్న రంగస్థల ప్రముఖుల్లో మరో ఐదుగుర్ని ఎంపిక చేసి రంగసాయి థియేటర్ అవార్డు ఈ ఏడాది నుంచి ఇవ్వనున్నట్లు తెలిపారు. తొలి పురస్కారాలు ప్రముఖ దర్శకుడు ఎస్ఎం భాషా, యువ నటుడు వి. సతీష్ కుమార్, నాటక ప్రోత్సాహకుడు, పరిషత్ నిర్వాహకుడు బుద్ధాల వెంకట రామారావు, పౌరాణిక రంగస్థల నటీమణి కె. మంగాదేవి, అతిపిన్న వయస్సు నుంచి పౌరాణిక పాత్రలు ధరిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొంది ప్రభుత్వ నంది పురస్కారం అందుకున్న బగాది రితీష్ చందుకు ఈ అవార్డు అందజేయనున్నట్లు చెప్పారు. అలాగే పదేళ్లలోపు బాలబాలికలచే 'సంక్షిప్త భారతం'అనే పౌరాణిక ఏకపాత్రాభినయం నిర్వహించనున్నట్లు చెప్పారు.